నమస్తే తెలంగాణ
# రంగారెడ్డి
I హైదరాబాద్, సోమవారం 31 మార్చి 2025 RANGAREDDY

### కరెంట్ కోతలతో నానని దుక్కులు



తాండూరు మండలం కోటబాసుపల్లి సబ్ స్టేషన్ పరిధిలో కరెంట్ ఎప్పుడు వస్తుందో ఎప్పుడు పోతుందో తెలియని అయోమయ పరిస్థితి. మండల పరిధిలోని కోటబాసుపల్లి, మిట్టబాసుపల్లి, గుంతబాసుపల్లి, జినుగుర్తి, సంకిరెడ్డిపల్లి గ్రామాల పరిధిలోని రైతులు ఉల్లిసాగు చేస్తారు. కొత్తగా ఉల్లినాట్లు వేసే వారికి దుక్కులు నానడంలేదు. – తాండూరు రూరల్, మార్చి 30

# అమ్మో.. ఆడిట్..

- జిల్లా డీఆర్డీవో నిర్వాకంపై విమర్శలు
- సోషల్ ఆడిట్‌కు రూ.50 వేల నుంచి లక్ష వరకు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు
- ఆడిట్‌కు ముందు జిల్లా బాస్‌కు ముట్టజెప్పేందుకు తంటాలు పడుతున్న ఈజీఎస్ ఉద్యోగులు



వికారాబాద్, మార్చి 30 (నమస్తే తెలంగాణ) : జిల్లాలో సోషల్ ఆడిట్ పేరు వింటేనే సంబంధిత ఉద్యోగులు జంకుతున్నారు. ఆడిట్ నిర్వహిస్తే ఈజీఎస్ పనుల్లో అవకతవకలు వెలుగులోకి వస్తాయని ఆందోళన చెందుతున్నారు. ఏ మండలంలో సోషల్ ఆడిట్ నిర్వహించినా తప్పనిసరి నిబంధన ఒకటి పెట్టినట్లు ప్రచారం జరుగుతున్నది. ఒకటి కాదు రెండు కాదు ఏకంగా రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు ముట్టజెప్పాలని ఆదేశిస్తుండడంతో చిన్నపాటి ఉద్యోగాలను వదులుకోలేక ఆపసోపాలు పడుతున్న ఈజీఎస్ ఉద్యోగులు అప్పులు చేసి మరీ ముట్టజెప్పుతున్నట్లు ప్రచారం జరుగుతున్నది. సోషల్ ఆడిట్‌లో ఏడాది మొత్తంగా ఈజీఎస్ పథకంలో చేసిన పనుల్లో అవకతవకలు ఏమైనా జరిగాయా అనే విషయాలను వెలుగులోకి తీసుకురావాల్సిన అధికారులే వసూళ్లకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. సోషల్ ఆడిట్ జరిగితే ఈజీఎస్ పనుల్లో జరిగిన అవకతవకలు వెలుగులోకి రావడమేమో కానీ సోషల్ ఆడిట్ ఖర్చుతో కూడుకున్న పనైపోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పనుల్లో జరిగే అవకతవకల నిగ్గు తేల్చేందుకుగాను ఏడాదికోసారి సామాజిక తనిఖీలు నిర్వహిస్తారు. ఈ సోషల్ ఆడిట్‌లో ఎంత మేర ఈజీఎస్ పనులు పూర్తి చేశారు, చెల్లించిన కూలీ డబ్బులు తదితర వివరాలను గ్రామపంచాయతీలో అందరి సమక్షంలోనే జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి తనిఖీలు చేపడుతారు. ప్రతీ మండలంలో ఒక్కో రోజు తేదీని నిర్ణయించి ఈజీఎస్ పనులపై సామాజిక తనిఖీలు చేస్తారు. ఇంత వరకు బాగానే ఉన్నా గతంలో ఎన్నడూలేని విధంగా జిల్లాలో సోషల్ ఆడిట్ పేరిట వసూళ్లకు పాల్పడుతున్నారని ఈజీఎస్ ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏదేమైనా శాఖను గాడిలో పెట్టాల్సిన అధికారి పైనే వసూళ్ల ఆరోపణలు రావడంపై సర్వత్రా విమర్శలు వస్తున్నాయి.

### అసంతృప్తి వ్యక్తం చేస్తున్న ఉద్యోగులు

గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి తీరుపై సొంత శాఖ ఉద్యోగులే అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఏ డీఆర్డీవో వ్యవహరించని విధంగా ప్రస్తుత డీఆర్డీవో తీరు ఉందని ఉద్యోగులు మండిపడుతున్నారు. తాము చిన్న ఉద్యోగులం, వచ్చే జీతంలో కుటుంబాన్ని నెట్టుకురావడమే సరిపోతుంది కానీ సోషల్ ఆడిట్ జరిగిన ఏడాదికోసారి రూ.లక్ష వరకు ముట్టజెప్పాలంటే అప్పు చేయాల్సిన పరిస్థితి వస్తున్నదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సోషల్ ఆడిట్ ఏ మండలంలో ఏ తేదీన జరుగనున్నదో తెలిపి.. ముందే డీఆర్‌డీవోకు సంబంధించి కోటరీ వర్గం ఆయా మండలాలకు సంబంధించిన ఈజీఎస్ ఉద్యోగులకు 'సార్ వస్తున్నారు సెట్ చేసుకోండని' ముందే చెబుతారన్న ఆరోపణలున్నాయి. డీఆర్‌డీవో కార్యాలయంలోనూ కొందరిని ఆయన కోటరీగా మార్చుకొని వారితోనే అంతా కానిస్తున్నట్లు ఆ శాఖ ఉద్యోగుల్లో ప్రచారం జరుగుతున్నది. మరోవైపు సబ్సిడీ ఎంటర్‌ప్రైజెస్ కార్యక్రమంలోనూ అవినీతికి పాల్పడుతున్నట్లు ప్రచారం జరుగుతున్నది. లేని కంపెనీలను ఏర్పాటు చేసినట్లుగా బోగస్ పేపర్లు, బిల్లులు సృష్టించి అక్రమాలకు పాల్పడుతున్నారనే ఆరోపణలున్నాయి. గ్రామీణాభివృద్ధి శాఖలో పనిచేసే ఒకరిద్దరు డీపీఎంలు చేసే ఈ అక్రమాలను చూసీచూడనట్లుగా ఉంటూ, తిలా పాపం తలా పిడికెడు అన్న మాదిరిగా నడుస్తున్నదని జోరుగా ప్రచారం జరుగుతున్నది.

# రెండు ఎకరాల సాగుకు.. లక్ష అప్పు



నీరులేక ఎండిపోయి, వడగండ్ల వర్షానికి నేలకొరిగిన మొక్కజొన్న పంటను చూపిస్తున్న రైతు నర్సింహులు

- లో ఓల్టేజీ కారణంగా బోరు నీరుపోయకపోవడంతో ఎండిపోయిన పంట
- 20 రోజుల్లో చేతికి వస్తదనుకుంటే ఇలా జరిగిందని రైతు ఆవేదన
- దిక్కుతోచని స్థితిలో మొక్కజొన్న పంటను పశువులకు మేతగా వేస్తున్న షాబాద్ మండలం ముద్దెంగూడ గ్రామానికి చెందిన కౌలు రైతు రాగులపల్లి నర్సింహులు

షాబాద్, మార్చి 30 : ఆరుగాలం కష్టపడి పంటలు పండించే అన్నదాతలు అరిగోస పడుతున్నారు. ఓ వైపు బోరుబావుల్లో నీటిమట్టం తగ్గడంతో వేసిన పంటలు ఎండుముఖం పట్టగా, మరోవైపు ఈదురుగాలులు, వడగండ్ల వర్షానికి చేతికొచ్చే సమయంలో పంట మొత్తం పాడైపోయింది. రంగారెడ్డిజిల్లా షాబాద్ మండలం ముద్దెంగూడ గ్రామానికి చెందిన కౌలు రైతు రాగులపల్లి నర్సింహులు అదే గ్రామంలో రెండు ఎకరాల పొలాన్ని కౌలుకు తీసుకుని మొక్కజొన్న పంట సాగు చేశాడు. ఇంకా 20 రోజుల్లో పంట చేతికొస్తదనుకునే సమయంలో లో ఓల్టేజీ కారణంగా బోరు నీరుపోయకపోవడంతో పంట ఎండిపోయింది. దీనికితోడు మూడు రోజుల క్రితం కురిసిన ఈదురు గాలులు, వడగండ్ల వర్షానికి మొక్కజొన్న పంట మొత్తం నేలకొరిగింది. దీంతో ఏమీ చేయలేక రైతు మొక్కజొన్న పంటను పశువుల మేతగా వేస్తున్నాడు. కౌలు కోసం రూ.50 వేలు, పంట పెట్టుబడి కోసం రూ.50 వేలు కలిపి మొత్తం రూ.లక్ష అప్పు చేశానని, చేసిన అప్పు ఎలా తీర్చాలోనని ఆ రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడంలేదని వాపోతున్నాడు. ప్రభుత్వం తనను ఆదుకోవాలని కోరుతున్నాడు.



మొక్కజొన్న పంటను పశువుల మేత కోసం ట్రాక్టర్‌లో తీసుకెళ్తున్న దృశ్యం



పెద్దేముల్ మండల పరిధి ఖానాపూర్ గ్రామంలో తాగు, సాగు నీటికి ఒకే ట్రాన్స్‌ఫార్మర్ ఉండటంతో లోడ్ ఎక్కువై తరచుగా ఫ్యూజులు పోతున్నాయి. కాని మరమ్మతులు చేయడానికి తగిన సిబ్బంది లేకపోవడంతో రైతులే మరమ్మతులు చేసుకుంటున్న దృశ్యం – పెద్దేముల్, మార్చి 30

# ట్యాంకర్ల నీళ్లే దిక్కు..!

- పంటను కాపాడుకునేందుకు రైతన్నల కష్టాలు
- రోజుకు వేలల్లో ఖర్చు చేస్తున్న వైనం



చింతపట్ల గ్రామంలో వరిపంటకు ట్యాంకరు ద్వారా నీరందిస్తున్న రైతు వెంకట్‌రెడ్డి

### ప్రశ్నార్థకంగా సాగు..

యాచారం, మార్చి 30 : మండలంలోని చింతపట్ల గ్రామానికి చెందిన రైతు ఇటికాల వెంకట్‌రెడ్డి తన పంటను కాపాడుకునేందుకు నిత్యం నానా అవస్థలు పడుతున్నాడు. తన పొలంలో నాలుగు బోర్లున్నప్పటికీ సాగు ప్రశ్నార్థకంగా మారింది. నాలుగు బోర్లలో ఇప్పటికే ఇటీవలే మూడు బోర్లు పూర్తిగా వట్టిపోయాయి. ఒక బోరు మాత్రం అంతంత మాత్రంగానే పోస్తున్నది. తనకున్న 12 ఎకరాల పొలానికిగాను పంటకు నీరందుతుందో లేదోననే సందేహంతో 6 ఎకరాల పొలంలో యాసంగిలో వరి పంటను సాగు చేశాడు. మొదట్లో పంట బాగానే ఉన్నప్పటికీ ఇటీవలే మూడు బోర్లు అడుగంటిపోయాయి. ఉన్న ఒక్క బోరుతో పంట తడారకపోవడంతో పాటు మండుతున్న ఎండలకు క్రమంగా ఎండిపోవడం మొదలైంది. దీంతో రైతు చేసేదేమీలేక కళ్లముందు ఎండిపోతున్న పంటను కాపాడుకునేందుకు సాహసం చేశాడు. ఒక్కో ట్యాంకరు నీటికి రూ.1000 ఖర్చు చేసి నీటి ట్యాంకర్ ద్వారా పంట చేనుకు నీరందించడం మొదలుపెట్టాడు. చేతికొచ్చిన పంటను పొట్ట దశలో ఎండిపోకుండా రోజుకు నాలుగైదు వేలు ఖర్చు చేసి పంటకు నీరందిస్తున్నాడు. అయినప్పటికీ ఒకవైపు నీరు పెడుతుంటే.. మరో వైపు పంట ఎండుముఖం పడుతున్నది. పంట పూర్తిగా ఎండిపోతే పశువులపాలు కాక తప్పదని వాపోతున్నాడు. వేలాది రూపాయల పెట్టుబడి బూడిదలో పోసిన పన్నీరు చందంగా మారిందని రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. పదేళ్ల కాలంలో ఎన్నడూ ఇంతటి కరువును చూడలేదని.. ఈసారి పంటల సాగు ప్రశ్నార్థకంగా మారిందని వాపోతున్నాడు. గత పదేళ్లు చెరువులు, కుంటలు నీటితో కళకళలాడాయని.. ప్రస్తుతం ఎండిపోవడంతో భూగర్భ జలాలు అడుగంటి రైతులకు సాగునీటి కష్టాలు వచ్చినట్లు పేర్కొన్నాడు. పంటలు ఎండిపోవడంతో ఆర్థికంగా తీవ్రంగా నష్టపోతున్నట్లు ఆయన తెలిపాడు. అయినా అధికారులు, ప్రజాప్రతినిధులు కనీసం కన్నెత్తి చూడటంలేదని వాపోతున్నాడు. పంటలెండిపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని, తగిన నష్టపరిహారం చెల్లించాలని కోరుతున్నాడు.

### మండలంలో అలుముకుంటున్న కరువు ఛాయలు

మంచాల, మార్చి 30 : భూగర్భ జలాలు ఒక్కసారిగా అడుగంటి పోవడంతో మండలంలో కరువు ఛాయలు అలుముకున్నాయి. ఎక్కడ చూసినా వరి పైర్లు ఎండిపోయి పశువులకు మేతగా వేస్తున్నారు. మంచాల మండలం బోడకొండ గ్రామానికి చెందిన రైతు మెగావత్ పాండు రెండు ఎకరాల్లో వరి పంటను సాగుచేశాడు. ఇప్పటివరకు తనకున్న రెండు బోరుబావులు వట్టిపోయాయి. దీంతో తాను సాగుచేసుకున్న వరి పంటకు నీళ్లు సరిపోకపోవడంతో పంటను కాపాడుకునేందుకు రైతు ట్యాంకర్‌కు వెయ్యి రూపాయల చొప్పున రోజూ నాలుగు ట్యాంకర్ల నీటిని కొనుగోలు చేసి పంటకు నీరు అందిస్తున్నాడు. పొట్ట దశలో ఉన్న వరి పంట చేతికి వస్తుందనే ఆశతో రైతు ట్యాంకర్లతో నీటిని పారబెడుతున్నాడు. ఇలా మండలంలోని కొర్రవానితండా, సత్తితండా, బొడకొండలో రైతులు పంటలను కాపాడుకునేందుకు నానాతంటాలు పడుతున్నారు.



బోడకొండలో వరి పంటకు ట్యాంకర్ ద్వారా నీరు అందిస్తున్న రైతు మెగావత్ పాండు

# నీళ్లు లేక రైతన్న కంట కన్నీరు

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా విద్యుత్తు సరఫరా సమయానికి చేయకపోవడంతో పంటలకు నీరు సరిగా అందడంలేదు. భూగర్భ జలాలు గణనీయంగా తగ్గిపోతున్నాయి. రోజురోజుకూ ఎండలు ముదురుతుండటంతో బోర్లు అడుగంటిపోతున్నాయి. సరిపడా నీళ్లు పడకపోవడంతో వరిచేన్లు ఎండిపోతున్నాయి. ఆరుగాలం శ్రమించిన కష్టం వృథా అవుతున్నదని రైతులు కన్నీరుమున్నీరవుతున్నారు. నీళ్లు లేక వరి చేను ఎండిపోతుండటంతో పశువులను మేపుతున్నామని వాపోతున్నారు. వరి చేను కాపాడుకుందామని బోర్లు వేసినా ఫలితం లేకుండా పోతున్నదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నీళ్లు ఉంటే పంట చేతికంది పెట్టుబడి వచ్చేదంటున్నారు. మునుపెన్నడూ ఇలాంటి పరిస్థితి రాలేదంటున్నారు. మాజీ సీఎం కేసీఆర్ వ్యవసాయాన్ని సస్యశ్యామలం చేస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను ఆగం చేస్తున్నది. పెట్టుబడి సాయం ఇస్తామని ఇప్పటి వరకు ఇవ్వలేదు. బీఆర్ఎస్ పాలనలో పంట సాగుకు ముందే డబ్బులు వస్తుండేవి. సంతోషంతో పంటలు పండించుకునే వాళ్లం. ఇప్పుడు ఇలా నీళ్లు లేక వరి పంటలు ఎండిపోతున్నా ఏ ఒక్క అధికారి, పాలకుడు రైతులను పట్టించుకోవడంలేదు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు ఎండిన పొలాలను పరిశీలించి రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు.

- సమయపాలన లేకుండా కరెంట్ సరఫరా
- పెట్టుబడి సాయం అందక అన్నదాత అప్పులపాలు
- అడుగంటుతున్న భూగర్భ జలాలు, ఎండిపోతున్న పంటలు
- పంటలకు నీరు అందక ఎండిపోతున్న వైనం
- తమ బతుకులు ఆగమయ్యాయని ఆవేదన
- పట్టించుకోని పాలకులు, అధికారులు

### కళ్ల ముందే ఎండిపోతున్నా ఏమీ చేయలేకున్న..



మార్చి నెల ప్రారంభంలోనే ఎండలు మండుతుండటంతో భూగర్భజలాలు అడుగంటాయి. బోరుబావిలో చుక్క నీరు లేక చేతికి వస్తున్న మా వరి పంట ఎండిపోతున్నది. పొట్టదశలో ఉన్న చేతికి వచ్చిన వరి నీళ్లు లేక కళ్ల ముందే ఎండిపోతున్న ఏమీ చేయలేకపోయా. అనారోగ్యంతో మా నాన్న ఇటీవలే మరణించాడు. ఇంటి భారం నాపై పడింది. ఉన్న పొలంలో మంచిగా వ్యవసాయం చేసుకుందామనుకుంటే వరి చేను పోయింది. ఇప్పుడు ఏమి చేయాలో దిక్కు తోచడం లేదు. ఈ బాధతో బుక్క బువ్వ నోట్లోకి పోవడంలేదు. అప్పులు చేసి పంట సాగు చేశా. ఇప్పుడు ఇలా పంటను చూస్తే చాలా భయమేస్తున్నది. బీఆర్ఎస్ హయాంలో సంతోషంతో పంటలు పండించుకునే వాళ్లం. ఇప్పుడు ఇలా నీళ్లు లేక వరి పంటలు ఎండిపోతున్నా ఏ ఒక్క అధికారి, పాలకుడు రైతులను పట్టించుకోవడంలేదు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు ఎండిన పొలాలను పరిశీలించి రైతులకు న్యాయం చేయాలి.

– నరేందర్, రైతు, జక్కెపల్లి, తాండూరు

### తక్కళ్లపల్లిలో ఎండిన వరిపంట



యాచారం : మండలంలోని తక్కళ్లపల్లి గ్రామానికి చెందిన తలారి రవి తనకున్న రెండెకరాల పొలంలో యాసంగిలో వరి పంట సాగు చేశాడు. మండలంలో ఇటీవల ఒక్కసారిగా కరువు ఛాయలు అలుముకోవడంతో పంట చేనుకు నీళ్లు లేక ఎండిపోయింది. తన పొలంలో ఉన్న రెండు బోర్లు ఇటీవలే అడుగంటడంతో సాగునీటి ఎద్దడి నెలకొన్నది. పైగా కరెంటు సరఫరాలో నిర్లక్ష్యం, లో వోల్టేజీ సమస్య అన్ని వెరసి వరి పంట పూర్తిగా ఎండిపోయింది. మరో నెల రోజుల్లో పంట చేతికొచ్చే దశలో పంట ఎండిపోవడంతో రైతు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. నీళ్లు లేక కండ్ల ముందే వరిపంట ఎండిపోవడంతో కన్నీరుమున్నీరవుతున్నాడు. ఇన్ని రోజుల కష్టం, పెట్టుబడి, సమయం పంట ఎండిపోవడంతో వృథాగా పోతున్నదని విచారం వ్యక్తం చేస్తున్నాడు. పంట ఎండిపోవడంతో తీవ్రంగా నష్టపోయినట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. పంట చేతికొచ్చే దశలో చేజారిపోయిందనే బాధను ఆయన వెళ్లగక్కాడు.

గత పదేళ్లలో ఇంతటి కరువు రాలేదని పేర్కొంటున్నాడు. నీళ్లు లేక ఎండిపోయిన పంటను పశువులకు మేపనున్నట్లు ఆయన తెలిపాడు. పంటలెండుతున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు పంటల వైపు కన్నెత్తికూడా చూడటంలేదని పేర్కొన్నాడు. ఎండిపోయిన పంటలను గుర్తించి, పంటలెండిపోయిన రైతులను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని కోరుతున్నాడు. లేదంటే ఆందోళనలు తప్పవని ఆయన హెచ్చరిస్తున్నాడు.

### నీళ్లు లేక పూర్తిగా వరి ఎండిపోయింది



ఆరుగాలం శ్రమించి పంట పండించే రైతులకు ప్రస్తుతం కన్నీరే మిగులుతున్నది. ముందెన్నడూ ఇంతలా రాని కరువు ఇప్పుడే వచ్చింది. మా బతుకులు ఆగమవుతున్నాయి. నా మూడెకరాల పొలంలో వరి పంట వేశాను. పంట చేతికివస్తుందన్న సమయంలోనే బోరుబావి అడుగంటడంతో నీళ్లు రావడంలేదు. దీంతో మండుతున్న ఎండకు వరి చేను పూర్తిగా ఎండిపోయింది. ఇక దిక్కుతోచక 3 ఎకరాల వరి పంటను పశువులకు మేతగా వదిలేశా. రూ.లక్ష వరకు ఖర్చుపెట్టి పంటసాగు చేసిన. బీఆర్ఎస్ పాలనలో కేసీఆర్ ఇచ్చినట్టు కాంగ్రెస్ పాలనలో సీఎం రేవంత్‌రెడ్డి పెట్టుబడి సాయం ఇస్తాడనుకున్నాం. అప్పుతెచ్చి పంటలు వేసిన. ఇలా పంట ఎండిపోవడంతో నాకేమీ తోచడం లేదు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇస్తామన్న పెట్టుబడి సాయం (రైతు భరోసా) ఇంకా అందలేదు. ఆ డబ్బులన్నా వస్తే కాస్త బాగుండేది. రాష్ట్రంలో రైతుల బాధలు తీరాలంటే మళ్లీ కేసీఆర్ వస్తేనే బాగుంటుంది. కాంగ్రెస్ పాలనలో సీఎం రేవంత్‌రెడ్డి నెరవేర్చని హామీలను ఇస్తూ రైతులను, ప్రజలందరినీ మోసం చేస్తున్నడు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 15 నెలలు గడిచినా రైతులకు ఇచ్చిన మాట నిలబెట్టుకోలేదు. బీఆర్ఎస్ పాలనలో కేసీఆర్ ఇచ్చిన రైతు బంధుతో వ్యవసాయం పండుగలా చేసుకున్నాం. ప్రభుత్వం నుంచి ఎలాంటి సాయం అందకపోవడంతో చాలా ఇబ్బందిగా మారింది. వెంటనే ఎండిన పంటలను పరిశీలించి రైతులను ఆదుకోవాలి.

– సిన్యానాయక్, రైతు, మకుందాపూర్, తాండూరు

### నీళ్లు లేక పంట ఎండిపోతున్నది



కడ్తాల్ గ్రామంలో నాకు మూడు ఎకరాల భూమి ఉన్నది. నాకున్న ఒక్క బోరుతో ఎకరా పొలంలో వరి పంట సాగు చేశాను. బోరులో రోజురోజుకూ నీళ్లు తగ్గిపోతుండటంతో వరి చేను ఎండిపోయే స్థితికి వచ్చింది. వరి పంటను కాపాడుకునేందుకు పదిహేను రోజుల క్రితం రూ.90 వేలు అప్పు చేసి రెండు బోర్లు వేయిస్తే చుక్క నీరూ పడలేదు. నీరందక కండ్ల ముందే పంట ఎండిపోతున్నది. పంట సాగు కోసం అప్పులు ఎలా తీర్చాలో అర్థం కావడంలేదు. ఇంత కరువు గతంలో ఎప్పుడూ చూడలేదు.

– కోశిక అంజయ్య, కడ్తాల్ మండలం

### పశువులను మేపుతున్నాం



రావిచేడ్ గ్రామంలోని రెండు ఎకరాల భూమిలో వరి పంట సాగు చేశాను. పంట పొట్ట దశకు వచ్చేసరికి బోర్లలో నీళ్లు అడుగంటాయి. నీరందక చేతికందే వచ్చే పంట ఎండిపోతున్నది. పొలమంతా ఎండిపోయి బీటలుగా మారిపోయింది. వరి చేనును చూస్తే ఏడుపు వస్తున్నది. పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదు. చేసేదేమీ లేక పశువులను మేపుతున్నాను. ప్రభుత్వం పంట నష్ట పరిహారం చెల్లించి ఆదుకోవాలి.

– రామచంద్రయ్య, కడ్తాల్ మండలం